ఏఎల్ పురంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - గొలుగొండ: గొలుగొండ మండలం మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో గత రెండు రోజుల నుండి ముమ్మరంగా పారిశుధ్య పనులు సర్పంచ్ లోచల సుజాత, ఈఓపీఆర్డీ, కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. గ్రామంలో ఉన్న అన్ని వీధుల్లో మురికి కాలువలు చెత్త మట్టితో నిండిపోయి ఉండటంతో కాలువల్లో నీరు ప్రవహిం చకపోవడంతో దోమల ఉధృతి అధికమవుతుందని, దీంతో ప్రజలు రోగాల బారిన పడతారని ఉద్దేశంతో ఈ పారిశుధ్య పనులు చేపట్టినట్లు సర్పంచ్ లోచల సుజాత తెలిపారు.

ప్రతిపక్ష పార్టీ నేతకి పంచాయతీ సిబ్బంది ఊడిగం

- జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీ ఏర్పాటులో వీరవిధేయత
- ఫ్లెక్సీలతో మునగపాకను నింపేసిన పంచాయతీ సిబ్బంది

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రమైన మునగపాకలో పంచాయతీ సిబ్బంది ప్రతిపక్ష పార్టీ నాయకుడిపై ఉన్న వీర విధేయతను బహిరంగంగానే కూటమి నాయకులకు కనువిప్పు కలిగేలా చాటుకున్న వైనం మండలంలో చర్చకు తావు లేపింది. పంచాయతీ సిబ్బంది తమకున్న ఉద్యోగ పరిధిని దాటి ప్రతిపక్ష పార్టీ నాయకుడి జన్మదిన వేడుకలకు సంబంధించిన ఫ్లెక్సీలను వారే స్వయంగా ప్రతి స్తంభానికి, కర్రలతో ఏర్పాటు చేసిన ఫ్రేమ్‌లకు బిగించి ఆనందం పొందారు. గడిచిన కొద్దిరోజులుగా మునగపాకలో క్షీణించిన పారిశుధ్య, కుళాయి పైప్ లైన్లు మరమ్మతులకు గురై మంచినీరు వృధాగా పోతున్న విషయాలపై "విశాలాంధ్రలో" వరుస కథనాలు వచ్చాయి. వచ్చిన కథనాలపై జిల్లాస్థాయి అధికారులు స్పందించి గ్రామంలో పర్యటించి మరమ్మతులకు, పారిశుధ్య మెరుగునకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పత్రికల్లో కథనాలు వచ్చేవరకు, అధికారులు స్పందించే వరకు నిద్ర నటించి, నిర్లక్ష్యం చేసి విధులను దుర్వినియోగం చేశారు. పంచాయతీ నిధుల ద్వారా జీతాలు తీసుకుంటూ పంచాయతీలో వారు చేయవలసిన పనులు చేయకుండా ప్రతిపక్ష పార్టీ నాయకుడి మెప్పు కోసం ఉద్యోగ బాధ్యతలను పక్కనపెట్టి పంచాయతీ వాహనంలో పుట్టినరోజు వేడుకలు ఫ్లెక్సీలను పెట్టుకుని వారే స్వయంగా ఏర్పాటు చేయడంపై పెద్ద దుమారమే రేగింది. విధుల్లో ఉన్న పంచాయతీ సిబ్బంది పంచాయతీ వాహనంలో ప్రతిపక్ష పార్టీ నాయకుడి జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలను ఎందుకు ఏర్పాటు చేయవలసి వచ్చింది? ఈ విషయంలో పంచాయతీ సెక్రటరీ ఏం చేస్తున్నారు..? సెక్రెటరీకి తెలిసే ఇది జరిగిందా..? అన్న విషయాలపై విచారణ జరపాలని కూటమి నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

విశాలంధ్ర - అచ్యుతాపురం: సేవా కార్యక్రమాలు చేయడం అభినంద నీయమని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక వికలాంగుల ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజలతో మమేకం అవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ప్రగడ జగన్నాథరావు, ప్రగడ వీరబాబు, ప్రగడ సంజీవరావు, ప్రగడ దుర్గాప్రసాద్, ప్రగడ పార్వతీదేవి, ప్రగడ రాజు, ప్రగడ చిన్ననాగేశ్వరరావు, ప్రగడ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో పారిశుధ్య పనులు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గత రెండు రోజులుగా తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని గోకులపాడు, తిమ్మాపురం గ్రామాల్లో మురుగు కాలువలు శుభ్రం చేయడం, వీధుల్లో చెత్త చెదారం తొలగించారు. ఈ పనులను సర్పంచ్ కర్రీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పరిశీలించారు.

జమాదులపాలెంలో పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర - కశింకోట: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని బుధవారం జమాదులపాలెం గ్రామంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించినట్లు కశింకోట పశువైద్యాధికారి డాక్టర్ అల్ఫోన్సా జార్జ్ తెలిపారు. పశు ఆరోగ్య శిబి శిబిరాన్ని గ్రామం ఎంపీటీసీ, కూటమి నాయకులు ప్రారంభించారు. శిబిరంలో 32 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 60 పశువులకు నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గూడువు లక్ష్మి రాజు, కూటమి నాయకులు,ఒమ్మి శ్రీనివాసరావు, కరక రాజు, పరవాడ రాము, మొల్లి రమణ, బొట్ట రాజారావు, గూడువు మణి కంఠ, కరక వెంకటరమణ పాల్గొని రైతులకు మినరల్ మిక్సర్ పంపిణీ చేశారు.

జడ్పీ సీఈఓకు అభినందన

విశాలాంధ్ర - మునగపాక: మునగపాక మండలం పరిషత్ సర్వసభ్య సమావేశానికి విశాఖపట్నం జిల్లా పరిషత్ సీఈఓ పి.నారాయణమూర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఇటీవల ఉత్తమ గణతంత్ర పురస్కారం వచ్చిన సందర్భంగా ఎలమంచిలి నియోజకవర్గ జెడ్పీటీసీలు పెంటకోట స్వామి సత్యనారాయణ, లాలం రాంబాబు, ధూళి నాగరాజు, కో ఆప్షన్ మెంబర్ నర్మల కుమారు కలిసి సత్కరించడం జరిగింది.

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని దార్లపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో ఎలమంచిలి ఫైర్ స్టేషన్ వారు అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా వాటిని నివారించాలి అనే విషయాలను ఎదురయ్యే సంఘటనల నమూనాలను విద్యార్థులకు చూపించారు. ఇందులో భాగంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డి.రాంబాబు గ్యాస్ సిలిండర్ నుంచి ఫైర్ వచ్చినప్పుడు దానిని ఏ విధంగా ప్రమాదం జరగకుండా ఆర్పి వేయాలో చేసి చూపించారు. అగ్నిమాపక అధికారి కే.అప్పలరాజు ఫస్ట్ ఎయిడ్ అండ్ వర్క్ సేఫ్టీ అండ్ లైఫ్‌లో భాగంగా లైఫ్ జాకెట్స్ ఏ విధంగా ఉపయోగించాలి అనే విషయాలు వివరించారు. అనంతరం ఒకేషనల్ టీచర్ బాలకృష్ణ వంట గ్యాస్ ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన చర్యలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణ శ్రీ, ఉపాధ్యాయులు దాసు, రమేష్, శేఖర్ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులకు మద్యం షాపులకై దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర - యలమంచిలి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ యలమంచిలి పరిధిలో కల్లుగీత కార్మికుల కొరకు ప్రభుత్వం అనకాపల్లి జిల్లాకి 15 షాపులు కేటాయించారని ఎక్సైజ్ సీఐ తేజ్ వెంకట్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యలమంచిలి మండలానికి ఒక మద్యం షాపు, రాంబిల్లి మండలానికి ఒక మద్యం షాపునకు ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా జారీ చేయడం జరిగిందని తెలిపారు. యలమంచిలి రూరల్‌కి గౌడ సబ్ కులం వారికి కేటాయిం చారని, రాంబిల్లికి శెట్టిబలిజను ప్రభుత్వం కేటాయించడం జరిగిందని అన్నారు. అప్లికేషన్ దరఖాస్తు కొరకు ఒక షాప్‌నకు 2 లక్షలు కేటాయించడం జరిగిందని, ఇది నాన్ రిటర్న్‌బుల్ అమౌంట్ అని, ఈ అప్లికేషన్ ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆన్‌లైన్ కానీ, ఆఫ్ లైన్ కానీ రిజిస్ట్రేషన్ చేసి అప్లికేషన్ సబ్మిట్ చేయాలని తెలిపారు. వెరిఫికేషన్ ఫిబ్రవరి 6వ తేదీన జరుగుతుందని, డ్రా ఫిబ్రవరి 7వ తేదీన ఉదయం 10 గంటలకు అనకాపల్లి ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ కాంప్లెక్స్‌లో జరుగుతుందని అన్నారు.

మద్యం పాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌కు సంబంధించి మూడు మండలాలైన యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో ఎక్సైజ్ నేరాలకు సంబంధించిన వివరాలు తెలియజేయాలని ఎక్సైజ్ సీఐ తేజ్ వెంకట్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, బెల్ట్ షాపులకి సంబంధించి, బెల్ట్ షాపుల కోసం గ్రామలో పాటలు పెట్టిన, సారాకి సంబందించి ఏ ఇతర డ్రగ్స్‌కి సంబందించి ఏ ఇన్ఫర్మేషన్ ఉన్న మాకు సమాచారం తెలపాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎవరైనా గ్రామాలలో మద్యం పాటలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రిపబ్లిక్ పెరేడ్ 2025 మార్చి ఫస్ట్ విభాగంలో దేవి ప్రసాద్ ప్రతిభ

విశాలాంధ్ర - సబ్బవరం: రిపబ్లిక్ పేరడే 2025 మార్చి ఫస్ట్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో సబ్బవరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం 9వ తరగతి విద్యార్థి దేవి ప్రసాద్ ప్రథమ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవ ఉత్సవాలలో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన రిపబ్లిక్ పెరేడ్ 2025 మార్చ్ ఫాస్ట్ విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించారని తెలియజేశారు. ఇందుకు ప్రోత్సహించిన పి.డి ప్రసాదు, పి.ఈ.టి సూర్యనారాయణలను అభినందిం చారు. విద్యార్థి దేవి ప్రసాద్‌ను ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, రాంబాబు, మోహన్‌రావు, జానకిరామ్ పాల్గొన్నారు.

సముద్రంలో పుణ్య స్నానాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో రేవు పోలవరం, బంగారమ్మ పాలెం గ్రామాల్లో భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. అమావాస్య కావడంతో భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్నానాలు చేసి అనంతరం వల్లభేశ్వర స్వామి, రాధామాధవ స్వామి ఆలయంలో దర్శనాలు చేసుకున్నారు.

సంపద సృష్టి కూటమి నాయకుల కోసమే..

ఎంపీ రమేష్ అండతో అక్రమ మైనింగ్

పార్లమెంట్ పరిశీలకులు కరణం ధర్మశ్రీ

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో కూటమి నాయకుల అవినీతి వరుగులు పెడుతుందని ఎంపీ రమేష్ అండతో మైనింగ్ మాఫియా అక్రమ మైనింగ్‌కు పాల్పడుతుందని వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు కరణం ధర్మశ్రీ ఆరోపించారు. అనకాపల్లి వైసీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు విద్దూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్‌కు ఎగనామం పెట్టి సంపద సృష్టి పేరుతో కూటమి నాయకులు దోచుకుంటున్నారని ఆరోపిం చారు. పెందుర్తి నియోజకవర్గంలో ఉన్న ఫార్మాసిటీ పొల్యూషన్ కంట్రోల్ కోసం గ్రీనరీ అభివృద్ధికి భూములు కేటాయిస్తే ఆ భూములను బినామీ పేర్లతో కొట్టేయ డానికి భారీ స్కెచ్ చేసారని ఆరోపించారు. అలాగే ఎల మంచిలి నియోజకవర్గంలో అచ్చుతాపురం ఎస్ఈజెడ్‌లో భూములు తీసుకొని పరిశ్రమలు పెట్టని వారి దగ్గర పూర్వం ఇచ్చిన దొరకే ఆ భూములను దోచుకోవడానికి రియల్ ఎస్టేట్ ముఠాను రంగంలో దింపారని ఆరోపించారు. పాయకరావుపేట నియోజక వర్గంలో మంత్రి, ఆమె అనుచరులు ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్ ముసుగులో భూ దళారులు ప్రవేశించి దందా చేస్తు న్నారని ఆరోపించారు. నర్సీపట్నం గంజాయికి అడ్డాగా మారిపోయిందని ఆరోపించారు. భవిష్యత్తులో కూటమికి మనుగడ లేదనే భయంతోనే ఇలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ చోడవరం సమన్వయకర్తగా నియమించమని స్వయంగా తానే జగన్మోహన్ రెడ్డికి సిఫార్సు చేసినట్లు తెలిపారు. పార్లమెంటు పరిధిలో ఉన్న ఏడు నియోజకవర్గాల సమన్వ యకర్తల సమన్వయంతో జిల్లాలో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తానని అందుకు సంబంధించి సీనియర్ నాయకులతో నియోజకవర్గాల వారీగా కోర్ కమిటీలు నియమిస్తానని తెలిపారు. అధికారం కోసం కూటమిచ్చిన హామీలు, కూటమి నాయకులు చేస్తున్న అక్రమాలు, స్థానిక సమస్యలపై ఉద్యమిస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డెడ ప్రసాద్, ఎంపీపీ గొర్లి సూరిబాబు, పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, అనకాపల్లి పార్టీ అధ్యక్షులు పెద్దిశెట్టి గోవిందా, కసింకోట జడ్పిటిసి దంతులూరి శ్రీధర్ రాజు, దంతును దిలీప్ కుమార్, కలగాగున్నయ్య నాయుడు, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, కేఎం నాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ కూరగాయలతో మేలు

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలో దేవి ఆలయం ఎదురుగా ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులు కూరగాయలు, పండ్లు, విత్తనాలు, చిరుధాన్యాలు, కషాయాలు, ఆకుకూరలు, కూరగాయలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేసి అమ్మకాలు సాగించి వాటిపై ప్రజలకు ప్రజలకు అవగాహన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల యాంకర్ గండి శ్రీనివాసరావు, మాస్టర్ ట్రైనర్ బి.దేవి, కొండాజీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రసాబాసగా మున్సిపాలిటీ బడ్జెట్, సాధారణ సమావేశం

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం మున్సిపాలిటీ బడ్జెట్, సాధారణ సమావేశం విమర్శలు, చల్లోక్తులతో సాగింది. మున్సిపాలిటీ చైర్ పర్సన్స్ బోడపాటి సుబ్బలక్ష్మి, అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టిడిపి కౌన్సిలర్లు చింత కాయల రాజేష్ బాబు, దనిమిరెడ్డి మధులు తీవ్రవాగ్వివాదం చేసుక న్నారు. నర్సీపట్నం మున్సి పాలిటీ 2025-26 సంవత్సర బడ్జెట్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ నాలుగు నెలల కాలంలో వీఎమ్మార్డీఏ నుంచి రూ.4.11 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.7.50 కోట్ల నిధులు మంజ రయ్యాయన్నారు. వీటిని తెచ్చిన ఘనత స్పీకర్ గౌరవ అయ్యన్నపాత్రుడు దేనని స్పష్టం చేశారు. ఈ నిధుల ద్వారా 43 అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచినట్టు ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వీధి దీపాలు పూర్తి స్థాయిలో లేక మున్సిపల్‌వాసులు నానా ఇబ్బందులు పడ్డారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక మొత్తం మున్సిపాలిటీలో దాదాపుగా రెండువేల వీధి దీపాలను పూర్తిస్థాయిలో అమర్చినట్టు చెప్పారు. వైసీపీ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 20వ వార్డు ఎస్టీ వార్డు కావడంతోనే నిధులు కేటాయించలేదా? అని ప్రశ్నించారు. దీనిపై 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ స్పందిస్తూ, "కౌన్సిల్ సమావేశానికి రావడానికి ముందు మీకు అందించిన ఎజెండా చదువుకోవాలని సూచించారు. 24వ వార్డు కౌన్సిలర్ ధనమిరెడ్డి మధు మాట్లాడుతూ నర్సీపట్నం నుండి కృష్ణదేవిపేట వెళ్లే ప్రధాన రహదారి శివపురం వద్ద గత వైసిపి ప్రభుత్వంలో కల్వర్టుకు గుంత పడితే, దానికి తూతూ మంత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శి ంచారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతన కల్వర్టు నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించడంతో యుద్ధ ప్రాతిపదికన ఈ పనులు పూర్తి చేసేందుకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్ర మంలో వైసిపి కౌన్సిలర్లు, 11వ వార్డు కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం, మాజీ చైర్పర్సన్ ఆదిలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ. 5 వేలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సబ్బవరం: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి పెందుర్తి నియోజకవర్గం వైసీపీ నాయకులు గండి రవికుమార్ ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామానికి చెందిన వాలంటీర్ దొమ్మిసి సతీష్ తండ్రి పారిశుధ్య

కార్మికుడు దొమ్మిసి రాము గత నెల రోజులు నుండి పక్షవాతంతో బాధపడుతున్నాడు. దీంతో గండి రవికుమార్ బుధవారం దొమ్మిసి రాము నివాసానికి వెళ్లి పరామర్శించి రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల యువజన విభాగం అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, ఐడి బాబు, కరక రాము, గురి శ్రీనివాస్, సిరపరపు శ్రీను, గోతిరెడ్డి అమ్మతల్లి, బత్తిన వెంకట్, పెందుర్తి కోటి, బంకపల్లి శంకర్, గండి రవికుమార్ యువ సైన్యం పాల్గొన్నారు.

నష్టాల ఊబిలో చెరకు రైతులు

విశాలాంధ్ర - కే.కోటపాడు: ప్రభుత్వం చెరకు మద్దతు ధర పెంచకపోవడంతో చెరుకు పండించే రైతులు తీవ్ర నష్టాల బారిన పడుతు న్నారు. తద్వారా ఏటికేడాది రైతులు చెరుకు పంటకు దూరమవు తున్నారు. ఇక్కడికి సమీపంలోని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ ప్రారంభం కావడంతో చెరకు రైతులు వారి వారి పనుల్లో బిజీ అయ్యారు. చెరకు తోటలు నరికించి ఆకులు తొలగించిన చెరుకును ఎడ్ల బండ్లు ట్రాక్టర్లపై షుగర్ ఫ్యాక్టరీకి తరలించే పనుల్లో రైతన్నలు బిజీగా ఉన్నారు. చెరుకు తోటల పనులు చేసేందుకు మహిళా కూలికి రోజుకి రూ.500 మగ కూలికి రూ.600 చెరుకు కట్టలను ట్రాక్టర్ లోడింగ్ చేసేందుకు రూ.700లు, పొలం నుండి షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తరలించేందుకు ట్రాక్టర్ ఒక్కంటికి రూ.1900లు రైతులకు ఖర్చవుతు న్నాయి. ఫ్యాక్టరీ ప్రస్తుతం చెరుకు ధర టన్ను ఒక్కంటికీ రూ.2500గా ధర నిర్ణయించింది. ఖర్చులు తీసివేస్తే రైతులకు మిగిలింది ఏమీ లేదని చెరకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరుకు టన్నుకి కనీసం రూ.3000 చెల్లిస్తేనే రైతులకు కొంత ఊరట లభిస్తుందని పలువురు కోరుకుంటున్నారు.

భర్త, అత్త, మామల వేధింపులకు వివాహిత ఆత్మహత్య

విశాలాంధ్ర - కశింకోట: భర్త, అత్త, మామల వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ దుర్ఘటన కశింకోట మండలం వెదురుపర్తి గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై కశింకోట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమకు, కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివేల కృపా సాగర్‌కు 2019 సంవత్సరంలో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్లు, రెండేళ్లు ఉన్న ఇద్దరు కుమార్తెలున్నారు. కొంతకాలం పాటు వీరి కాపురం సజావుగా సాగింది. తర్వాత కొన్నాళ్లుగా భర్త, అత్త, మామ, ఆడపడుచు కలిసి సుమను వేధింపులకు గురి చేస్తున్నారు. అదనపు కట్నం తేవాలని, అలాగే సుమను అవమానిస్తూ సూటిపోటి మాటలు అంటున్నారని బాధితురాలు తల్లి వెంకయమ్మ పోలీసులు ఫిర్యాదులో పేర్కొంది. ఇటీవల సుమ పశ్చిమగోదావరి జిల్లాలోని తన పుట్టింటికి వెళ్లి వారం రోజుల కిందటే వెదురుపర్తిలోని భర్త ఇంటికి వచ్చింది. ఈ నేపథ్యంలో భర్త, అత్తింటి వేధింపులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైన సుమ ఇంట్లో ఉన్న ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు సుమను బయటికి తీసేసరికే తుది శ్వాస విడిచింది. భర్త అత్తింటి అరాచకాలకు తమ కూతురు బలైందని బాధితురాలు తల్లి వెంకయ్యమ్మ ఆవేదన వ్యక్తం చేసింది. మృతురాలికి తల్లి వెంకయ్యమ్మ, ఇద్దరు సోదరులు ఉన్నారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ లక్ష్మణరావు చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ అల్లు స్వామి నాయుడు తెలిపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి క్రీడాకారులు

విశాలాంధ్ర - నక్కపల్లి: జాతీయ స్థాయిలో జరిగే హాకీ పోటీలకు నక్కపల్లి హాకీ క్లబ్ తరపున ఎంపికైన విద్యార్థులు ఆడనున్నట్లు హాకీ క్లబ్ డైరెక్టర్ బలిరెడ్డి సూరిబాబు ప్రధాన కార్యదర్శి తాతాజీలు తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎస్.జి.ఎఫ్ అండర్ 19 హాకీ క్రీడా పోటీలు గత ఏడాది నవంబర్ 5,6,7 తేదీలలో కాకినాడలో జరగగా క్రీడాకారులు బాలురు విభాగంలో ఏం. మణికంఠ, కె.అనిల్ కుమార్, కె.సాయిరామ్, బాలికల విభాగంలో ఎం. పూర్ణిమ మంచి ప్రతిభ కనబర్చడంతో ఆంధ్రప్రదేశ్ హాకీ జట్టుకు ఎంపిక అయినట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజన్ కార్యదర్శి శ్రీలక్ష్మి, పీడీ తరుణ్ కుమార్, బియస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు సంయుక్తంగా తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులు జనవరి 29 నుండి ఫిబ్రవరి 2 వరకు జార్ఖండ్ రాజధాని రాంచిలో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజన్ కార్యదర్శి శ్రీలక్ష్మి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం అయిన నక్కపల్లి క్రీడాకారులు వచ్చిన ప్రతి అవకాశం అందిపుచ్చుకుని విజయాలు సొంతం చేసుకుంటున్నారన్నారు. ఈ జాతీయ పోటీలకు ఎంపిక అయిన క్రీడాకారులకు బి.యస్ హాకీ క్లబ్ అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి, కొల్నాటి తాతాజీ, కోచ్ రాంబాబు, జాతీయ సీనియర్ క్రీడాకారుడు రామచంద్ర రావు, కొల్నాటి నానాజీ, గ్రామ పెద్దలు, క్రీడాకారులు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన బీజేపీ నేతలు

విశాలాంధ్ర - పాయకరావుపేట: పట్టణంలోని భారతీయ జనతా పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు సంద ర్శించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యక్ర మాలు నిర్వహిస్తూ, పార్టీ అభివృద్ధి కృషి చేస్తున్న పిఎంజెజెకేవై రాష్ట్ర అధికార ప్రతినిధి, డాక్టర్ బొల్లవరపు రత్న భరత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆచంట శ్రీకాంత్‌లను అభినందించారు. పార్టీ కార్యాలయాన్ని సందర్శించిన వారిలో పార్టీ బీసీ మోర్చా మాజీ జిల్లా అధ్యక్షులు వెంకటేష్, వరుపుల తలుపులు, వరుపుల ప్రసాద్, పిల్లి రాంబాబు ఉన్నారు.

గొల్లగుంటలో డ్రైనేజీ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పరవాడ: రావాడ పంచాయతీ పరిధి గొల్లగుంట గ్రామంలో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం స్థానిక సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పర్యవేక్షించారు. పంచాయతీ సాధరణ నిధులు రూ.8లక్షల అంచనా వ్యయంతో పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ మోటూరు సన్యాసి నాయుడు తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న డ్రైనేజీ ద్వారా మురుగు నీరు చివర వరకు పోయేవిధంగా వాటర్ లెవి లింగ్, పనుల నాణ్యత సరిచూసు కోవాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరిషాకు సూచనలు చేశారు. కాగా మార్చినెలలో పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభం కానున్న సందర్భంగా మహిళలకు నమాజ్ చేయుటకు వీలుగా కమ్యూనిటీ భవనానికి మరమ్మతు చేయించాలని స్థానికులు సర్పంచ్‌ను కోరారు. స్పంధించిన సర్పంచ్ కమ్యూనిటీ భవనం మరమ్మతులకు సంబంధించి తీర్మానాలు, అంచనాల వ్యయం తయారు చేసామని తెలిపారు. ఫిబ్రవరి నెల చివరికల్లా మరమ్మతు పనులు పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ శిరిషాకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచా యతీ కార్యదర్శి అనురాధ, వార్డు సభ్యులు సైరా బేగం, కాంట్రాక్టర్ సోమేష్, పంచాయతీ సిబ్బంది హుస్సేన్, త్రినాథ్, గ్రామస్తులు మదీనా, అభిదా బేగం, అన్సార్, మక్బుద్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

విశాలాంధ్ర-కే కోటపాడు : ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీ నందు వారి వ్యక్తిగత వివరాలు, వ్యవసాయ భూమి వివరాలు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయధికారి బి.మోహన్ రావు అన్నారు. బుధవారం దాలివలస లో జరిగిన పొలంపిలుస్తోంది కార్యక్రమం లో ఫార్మర్ రిజిస్ట్రీ గురించి రైతులకు వివరించారు. ఈ రిజిస్ట్రీ వ్యవసాయ, రెవిన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయని , రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుకు 14 నెంబర్లు గల ఒక గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి రైతు రైతు సేవ కేంద్ర లో ఉన్న వ్యవసాయ , ఉద్యాన అధికారులను సంప్రదించలన్నారు. అలాగే ఎన్ పి ఎస్ ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వేయలన్స్ సిస్టం) యాప్ ను రైతులు వినియోగించుకోవాలన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు వారు పండించు పంటలకు వచ్చే వివిధ రకాల తెగుళ్ల ను గుర్తించి తగు నివారణ చర్యలను తీసుకుంటారని అన్నారు. వేరుశనగ, నువ్వులు మొక్కజొన్న వేసుకునే రైతులు భూమిలో కాల్షియమ్ మిగ్నేషియమ్ సల్ఫేర్ కలిగిన మిశ్రమ ఎరువును వాడాలన్నారు . దీనివల్ల నాణ్యమైన దిగుబడులు పొందవచన్నారు. ప్రతి సారి ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి చెయ్యాలని తక్కువ పెట్టుబడి తో సాగు అయ్యే పంటలైన ఉలవలు , అలసంద , బొబ్బర , చోడి తదితర పంటలు అలవాటుచేసుకోవాలన్నారు . అవకాశం ఉన్న ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం అలవర్చుకోవాలన్నారు. అనంతరం కాయకూరలు పండిస్తున్న రైతుల పొలాలకు వెళ్లి ఎన్ పి ఎస్ ఎస్ యాప్ ను వాడుకునే విధానాన్ని రైతులకు వివరించారు . ఈ కార్యక్రమం లో సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్ళు,రెడ్డి రామస్వామి, భూమిరెడ్డి సన్నిబాబు, మండల వ్యవసాయఅధికారి సోమ శేఖర్, ఎఇఓ లు లైలా, ప్రియాంక, వ్యవసాయ సిబ్బందివి సుదీర్ దొర , శిల్ప , సౌజన్య అనూష రైతులు పాల్గొన్నారు.

గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం, ఎల్లుప్పి (మర్రిపాలెం) గ్రామాల్లో బుధవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు అంతకా పల్లి పశు వైద్యాధికారి డా. జి.అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. గొల్లల పాలెం గ్రామంలో నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మోపాడ అప్పారావు ప్రారంభించారు. ఈ రెండు గ్రామాల్లో 26 పశువులకి వైద్య పరీక్షలు, 32 పశువులకు గర్భకోశ వ్యాధులకి చికిత్సలు, 24 పశు వులకు చూడి తనిఖీలు, 64 దూడలకి నట్టల నివారణ మందులు వేసినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.అరుణ మాట్లా డుతూ ఈనెల 30న ఆదిరెడ్డిపాలెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధి కారులు డా. ఎస్.స్వర్ణలత, డా. బి.సంధ్య, వెటర్నరీ అసిస్టెంట్ శివ, పశు సంవర్ధక శాఖ సహాయకులు అప్పలరాజు, కె.వెంకటరావు, ఎ.రమేష్, డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు

విశాలాంధ్ర-మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాకలో దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు మహెూత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మునగపాకలో గౌరీ పరమేశ్వర ఆలయం నుండి ఊరేగింపు ప్రారంభమై పల్లపు వీధి, సంతబయల,పంచాయతీ వీధి,మెయిన్ రోడ్ మీదగా ఊరేగింపు ఘనంగా జరిగింది.గ్రామంలో అన్ని ప్రాంతాల నుంచి మహిళలు వివిధ రకాల పిండి వంటలను సారే ఊరేగింపులో ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ,ఉత్సవ కమిటీ సెక్రటరీ ఆడారి అప్పలనాయుడు,ఉత్సవ కమిటీ కోశాధికారి పొలిమేర కృష్ణ,ఆడారి కాశీబాబు,ఆడారి శ్రీకాంత్,ఎంపీటీసీ సూరిశెట్టి రాము,ఆడారి రాము,మారిశెట్టి అప్పారావు,శరగడం జగన్,సూరిశెట్టి అప్పలనాయుడు,ఆడారి రవి,పెంటకోట రామ గణేష్,గౌరీ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తీర్థం పోస్టర్ ను ఆవిష్కరించిన చైర్మన్ ప్రగడ

విశాలంధ్ర-అచ్యుతాపురం : శ్రీ అభయాంజనేయ తీర్థం పోస్టర్ ను రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ , యలమంచిలి తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు బుధవారం ఆవిష్కరించారు . మండలంలో మోసయ్యపేట గ్రామంలో ఈ నెల 4వ తేదీన శ్రీ అభయాంజనేయ తీర్థ మహెూత్సవంను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచదార్ల పైడిరాజు , ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలి

విశాలాంధ్ర-అచ్యుతాపురం : మండలంలో కేంద్రమైన అచ్యుతాపురం జంక్షన్ లో నిర్వహిస్తున్న షూట్ బాల్ లాటరీ జూదాన్ని వెంటనే ఆపాలని సిపిఎం మండల కన్వీనర్ ఆర్. రాము అన్నారు . బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రజలను నిలువునా దోచుకుంటున్న ఇటువంటి జూదాలను వెంటనే ఆపాలని , వీటిపై ప్రభుత్వం , పోలీస్ అధికారులు వెంటనే చర్యలు తీసుకొని ఇటువంటివి జరగకుండా చేయాలని కోరారు .

అన్న క్యాంటీన్ కు ఎమ్మెల్యే కోళ్ల స్థల పరిశీలన

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పట్టణం లో అన్నా కెంటిన్ ఏర్పాటు కు బుధవారం ఉదయం స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి అధ్వర్యంలో పట్టణం లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం కు వెళ్లే దారిలోను, పాత బస్ స్టాండ్ ఆవరణలో ను కెంటిన్ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించారు. ఆమె వెంట జిల్లా అధికారులు తో పాటు, స్థానిక ఎంపీడీఓ సతీష్ , తహసీల్దార్ అరుణకుమారి, మరియు కూటమి నాయకులు పాలుగున్నారు

ఎస్ కోటలో అర్ధరాత్రి పలుచోట్ల చోరీలు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. ముందుగా దుకాణాల్లో ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా నలుగురు దొంగలు సీతం పేటలో ఉన్న ఒక కొరియర్ ఆఫీస్ లో సుమారు 2.30 నిముషాల సమయంలో శట్టర్ ఎత్తి పెట్టి లోన కౌంటర్ లో ఉన్న సుమారు 70.000వేల రూపాయలు దొంగిలించారు. మరల మార్గ మధ్యలో ఉన్న వన్ వే ట్రాఫిక్ వద్ద మూడు గంటల సమయంలో వైన్ షాపులో యధావిధిగా శట్టర్ ఎత్తి లోన ఉన్న మందు బోటిల్ లను దొంగిలించి అలాగే విశాఖ అను కోడు రోడ్డులో పట్టణ శివారులో ఉన్న ఒక హెూల్ సేల్ కిరాణా దుకాణంలో దూరి అందులో అయిదు నూనె డబ్బాలు ,నాలుగు బియ్యం బస్తాలు దొంగిలించారు, తెల్లవారి విషయం తెలుసుకున్న దుకాణ దారులు పోలీస్ లకు తెలుపగా వారు తమ సిబ్బంది తో ఆయా దుకాణాల వద్దకు వెళ్లి సీసీ కెమెరాలను పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ ఐ గంగరాజు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలి

లంకెలపాలెంలో జీపు జాత వద్ద మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

విశాలాంధ్ర-పరవాడ; విశాఖ స్టీల్ ప్లాంట్‌ను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సెయిల్)లో విలీనం చేసి ప్లాంట్‌కు సొంత ఘనులు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేసారు. నెల్లూరులో ఫిబ్రవరి 1నుంచి 3వ తేదీ వరకు జరుగు పీసీఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ని పరిరక్షించాలని కోరుతూ స్టీల్ ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు తలపెట్టిన జీపు జాతకు బుధవారం లంకెలపాలెం వద్ద సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ కాదని ప్రయివేటీకరణ చేయమని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్యాకేజీ కింద రూ.11,400 కోట్ల రూపాయలు ఇచ్చి విశాఖ స్టీల్ ప్లాంట్‌ని ఆదానికి అమ్మాలని చూస్తున్నారని మండిపడ్డారు. అలా కానిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయడానికి అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. విలీనం చేయడానికి సెయిల్ అథార్టీ ఒప్పుకోలేదని కాకమ్మ కథలు చెబుతున్నారన్నారు. అదీ ఐదీ ప్రభుత్వ రంగ సంస్థలే కాబట్టి దీనికి అభ్యంతరం ఏమందన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేస్తే 40వేల ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంతం నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అటువంటి చర్యలు చేపట్టకుండా ప్రయివేటీకరణ చేయాలని దురుద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం ప్యాకేజీ ఇస్తుందని పేర్కొన్నారు. నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభల్లో విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టే కార్య క్రమాలు రూపొందించనున్నామని లోకనాథం తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్ ప్లాంట్ యూనియన్ నాయకులు ఎం.రామారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కరణం వెంకటరావు, డి.దేముడు, శ్రీను, రాము, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

30 నుండి ఫిబ్రవరి 6 వ తేదీ వరకు శ్యామా అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర-సబ్బవరం: మండలంలోని దేవీపురం శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరీ దేవీ పీఠంలో ఈనెల 30వ తేదీ నుండి ఫిబ్రవరి నెల 6 వ తేదీ వరకు శ్యామా నవరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్యామా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు శ్రీ విద్యా ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రమా, దేవీపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉదయం 8 గంటలకు గోమాత పూజ పూజతో శ్యామా నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమవుతాయి అని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు అమ్మవారికి అభిషేకం %౬% శోడషోపచార పూజలసామూహిక కుంకుమ పూజ, ప్రతీ రోజు అర్చనలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాయంత్రం 4 గంటల నుండి 6 గంటల వరకు రాజ శ్యామల హెూమం,శ్యామా యంత్ర పూజ,విశేషా (ప్రత్యేక) పూజ,హారతి & ప్రసాదం కార్యక్రమాలు నిర్వహించి నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3 న వసంత పంచమి అక్షరాభ్యాసం, వాగ్దేవి హెూమం (విద్యా ర్థులకు ఉచితం), ఫిబ్రవరి 4 న రథసప్తమి భాస్కర ఆరాధన , ఫిబ్రవరి 6 న సిరి జ్యోతి పూజ, సామూహిక శ్యామ సహస్రనామార్చన ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

కుష్టు రోగులు గుర్తింపు ఇంటింటి సర్వే పరిశీలన

విశాలాంధ్ర-సబ్బవరం: మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ (ఎల్ సి డిసి), కార్యక్రమం ఈనెల 20వ తేదీ నుండి ఫిబ్రవరి 2వ తేదీ వరకు మొత్తం 14 రోజులు ఎల్ సి డి సి సర్వే జరుగుచున్నదని పీహెచ్సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎస్ ఆర్ ఎన్ చక్రవర్తి తెలిపారు. ఈ మేరకు బుధవారం కుష్టువ్యాధి లక్షణాలను గుర్తించడానికి సర్వే చేపడుతున్న తీరు, ఏ మేరకు పూర్తి చేశారన్న వివరాలను సెంట్రల్ లెప్రసీ డైరెక్టర్ డాక్టర్ విజయ కుమారన్ ,డాక్టర్ భాగ్య జ్యోతి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్, అనకాపల్లి జిల్లా లెప్రసీ ఆఫీసర్ ఎ వి ఎస్ కే బాలాజీ సబ్బవరం మండలంలో కొన్ని గ్రామాలను పర్యవేక్షించారు. అనుమానిత లక్షణాలతో ఎవరినైనా గుర్తించారా అని ఆరా తీసి సర్వే పూర్తి చేసి, ఇంటికి మార్కింగ్ విధానాన్ని గమనించారు. ప్రతి ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు అందర్నీ క్షుణ్ణంగా పరీక్షించాలన్నారు. లక్షణాలను త్వరగా గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చని సూచించారు. అలాగే పీ హెచ్ సి సంబంధించిన లెప్రసీ రికార్డులను పరిశీలించారు. మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రెసిడెన్షియల్ స్కూల్ నందు లెప్రసీ అవేర్నెస్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ ఎన్ ఆర్ చక్రవర్తి మరియు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది,హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి సహకరించండి

విశాలాంధ్ర-భోగాపురం: విమానాశ్రయ ప్రవేశ రహదారి నిర్మాణానికి సహకరించాలని ఆర్డీ ఓట్ల కీర్తి రైతులను కోరారు. మండలంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అప్రోచ్ రోడ్ కోసం సేకరించిన భూమి పరిహారం అందలేదని రైతులు ఇచ్చిన పిర్యాదు మేరకు ఆర్డీవో బుధవారం ఆ భూములను క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అయితే రైతులైన దారపు అప్పన్న, దల్లి కనకరాజు, శీరపు రెడ్డి మొదలగు రైతులు స్థానిక జనసేన నేత మట్ట అయ్యప్ప రెడ్డి ఆధ్వర్యంలో ఆర్డీవోను కలిశారు. గూడెపువలస రెవిన్యూ పరిధిలో 20 ఎకరాలకు అవార్డు పాస్ చేయడం జరిగిందని ఈ విషయం కోర్టులో ఉన్నందున త్వరలోపరిహారం రైతులకు జమ అయ్యేటట్టు చూస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చారు. అలాగే విమానాశ్రయ సిబ్బంది నివాసం నిమిత్తం ముంజేరు వద్ద నిర్మిస్తున్న సిబ్బంది నివాసాలకు వెళ్లే రోడ్డు ను పరిశీలించారు. ఈ రహదారికి భూములు ఇవ్వాలని సంబంధిత రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎం.సురేష్, సర్వేయర్ ముడికేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు కమీషనర్ కీలక నిర్ణయం

భవిష్యత్తులో రాజాంలో డ్రైనేజ్ సమస్య లేకుండా చర్యలు

విశాలాంధ్ర-రాజాం : రాజాం మున్సిపాలిటీ పరిధిలోని గెడ్డలు, చెరువుల ఆక్రమణల తొలగింపునకు కమీషనర్ జె. రామప్పలనాయుడు నిర్ణయం చారు. ఈ మేరకు బుధవారం డోలపేట నుంచి అంతకాపల్లి గ్రామం వరకు వెళ్లే 'మెయిన్ డ్రైన్' ను ఆయన ఆధ్వర్యంలో సర్వే, టౌన్ ప్లానింగ్, శానిటరీ విభాగాల అధికారులు, సిబ్బంది పరిశీలించారు. సుమారు 2 కి. మీ. పొడవు ఉన్న ఈ డ్రైన్ చాలా భాగం ఆక్రమణలకు గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. అలాగే, అయిదు భవనాలు కూడా ఉన్నట్లు గుర్తించిన అధికారులు, ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. డోలపేట, కొండంపేట, సారథి, గోపాలపురం, డివిపీ స్కూల్ నుంచి పొనుగుటివలస కు వెళ్లే డ్రైన్, ఎలీసి బిల్డింగ్ వెనుకభాగాల్లో ఉన్న డ్రైన్లు ను వరదకాల్వలుగా అభివృద్ధి చెందించే ఆలోచన చేస్తున్నట్లు కమీషనర్ రామప్పలనాయుడు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఆక్రమణలు ఉంటే తొలగించడం జరుగుతుందని, అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టిపిఓ తేజేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్ ప్రసాద్, సర్వేయర్ మరివి ఈశ్వర నారాయణ పాల్గొన్నారు.

వేటూరి సాహితీ పురస్కారం పొందడం నా అదృష్టం

తెలుగు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

విశాలాంధ్ర-పాయకరావుపేట: వేటూరి సాహితీ పీఠం పురస్కారం పొందటం అదృష్టంగా భావిస్తున్నానని తెలుగు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీ ప్రకాష్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుద్దాల అశోక్ తేజకు 14 వ వేటూరి పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి, వేటూరి సాహితీ పీఠం ప్రధాన కార్యదర్శి సిహెచ్ విజయ్ ప్రకాష్, వ్యవస్థాపక అధ్యక్షులు చక్కా సూర్యనారాయణ, వ్యవస్థాపక కార్యదర్శి కె ఆర్ జె శర్మ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలో తిమ్మరాజుపేట గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందని నాగులాపల్లి పశు వైద్యాధికారిని పద్మజ తెలిపారు.గర్భ కోశ వ్యాధులకు,ఎదకురాని పశువులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.అలాగే ఉపాధి హామీ పథకంలో పశు గ్రాసం సాగుకు అవకాశం ఉందని,దీనిని రైతులు వినియోగించుకోవాలని డాక్టర్ పద్మజ కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు,మాజీ సర్పంచ్,పాల సొసైటీ ప్రెసిడెంట్ శరగడం జగన్నాథరావు,బీ.వీ కృష్ణారావు, గ్రాము ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, మాజీ సర్పంచ్ సూరిశెట్టి రాము,జనసేన పార్టీ ప్రెసిడెంట్ భాస్కర్, వెటర్నరీ డాక్టర్ కోదండరావు,పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొద్దేడ జన్మదినం సందర్భంగా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

పోటీలను ప్రారంభిస్తున్న యలమంచిలి ఎంపీపీ గోవింద్, వైసీపీ నేతలు

విశాలాంధ్ర-మునగపాక: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొద్దేడ ప్రసాద్ జన్మదిన సందర్భంగా మేజర్ పంచాయతీ మునగపాక నందీశ్వర కళా ప్రాంగణం వద్ద జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి.జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను యలమంచిలి ఎంపీపీ గోవింద్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మూలపేట గ్రామ సర్పంచ్ బిశెట్టి గంగప్ప నాయుడు,మునగపాక సర్పంచ్ దిబ్బల అప్పారావు,అరబుపాలెం సర్పంచ్ బొద్దేడ శ్రీనివాసరావు,ఎంపీటీసీ మద్దాల వీరు నాయుడు,మండల వైసీపీ అధికార ప్రతినిధి ఆడారి కాశీబాబు, తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్,వైసీపీ సీనియర్ నాయకులు నరాలశెట్టి సూర్య నారాయణ, మాజీ ఎంపీటీసీ రాజాన బుజ్జిబాబు, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు టెక్కలి కొండలరావు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ మళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.